# చిన్నాన్న

సీతాపతి పనిచేస్తున్న ఆఫీసులోనే బి. సెక్షను సూపర్నెంటు రఘురాం. లంచ్ టైంలో క్యాంటీన్లో చాలా క్యాజువల్‌గా చెప్పాడు. మంచి ఫ్రెండ్ కాబట్టి ఏదైనా చెప్పే చనువతనికుంది. నిజానికి ఆ మాట సీతాపతి కొడుకు వాసు గురించి కాంప్లిమెంటుగా చెప్పింది. అయితే, రఘురాం ఏం చెప్పినా వినేవాళ్లు దానిగురించి క్షణకాలం కూడా ఆలోచించుకునే వ్యవధి ఇవ్వడు. అతని మాటలు ప్రవాహంలా సాగుతాయి. అతివేగంగా ఉరకలు వేస్తాయి. మందాకిని కాదు, సాగర తరంగాలతో పోటీపడే అలక్‌నంద జలాల వేగోద్ధతిలో దుముకుతూ పోతాయి. మాటల జోరే. మనిషి సాధువు, జాలిగుండె.

రఘురాం అన్నమాటలు అప్పుడు ఆలోచించడానికి సీతాపతికి అవకాశం చిక్కలేదు. ఆ మాటల వేగానికి లంచ్‌టైం నిమిషంలో ముగిసినట్లనిపించింది. ఆ వాక్ప్రభంజనం సీతాపతిని ఫైళ్ళ మధ్యకి విసిరేసింది.

సీతాపతి ఫైళ్ళు తిరగేస్తుంటే రఘురాం చెప్పిన సంగతి మనసులో మెదిలింది. ఈ మధ్యకాలంలో ఎన్నడూ లేనిది వాసు అకస్మాత్తుగా గుర్తుకొచ్చాడు అనడంకంటే రఘురాం గుర్తుకు తెచ్చాడు అనడం సబబు. సీతాపతికి ఆశ్చర్యం కలిగింది.

వాసుకిప్పుడు తను మనసులో నిలిచే వాతావరణం అసలే లేదు. మనిషి మనసు ఎన్నింటిని గుర్తు పెట్టుకుంటుంది? బారసాల ఘట్టం సీతాపతికి జ్ఞప్తికి రావడంలేదు. నామకరణం మాత్రం కొంచెం జ్ఞాపకం వుంది. తర్వాత కొద్దికాలం 'వాసు' అనే పేరు మనసులో నిలిచింది. తర్వాత ఆవిరైపోయింది. భార్య మాలతి కొడుకును కన్న నాలుగేళ్ళకే కన్ను మూసింది. పసివాడి కోసం మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని దగ్గరి బంధువులు సలహా ఇచ్చారు. సీతాపతి ఎగిరి గంతేసి మంజుల మెళ్ళో మూడు ముళ్ళూ వేశాడు. గ్రీష్మంలో ఆమని వచ్చింది. రెండో మధుమాసం మరింత మధుభరితం. కాలమంతా వెన్నెల హేలగా తోచింది. మాలతి ఆకృతి సీతాపతి స్మృతిపథంనుంచి పూర్తిగా చెరిగిపోయింది. కొడుకు వాసును అల్లారుముద్దుగా పెంచి పెద్దచేస్తానని మాలతికిచ్చిన మాట గాలికి కొట్టుకుపోయింది. మాలతి ప్రసక్తి ఆ ఇంట్లో నిషిద్ధం. ఇది మంజుల ఆనతి. సీతాపతి తప్పక కట్టుబడి వుండాలి.

ఆ ఇంట్లో తన రక్తం పంచుకుపుట్టిన తల్లి లేని పిల్లవాడు పెరుగుతున్న సంగతి గమనించకుండా సీతాపతి వ్యవహరిస్తున్నాడు. అందులో ఆశ్చర్యం లేదు. అదంతా మంజుల జడనుంచి వీచే పరిమళాల మత్తు ప్రభావం.

ఏమి తింటున్నాడో, ఎప్పుడు తింటున్నాడో, ఎలా వున్నాడో అడిగే దిక్కులేనివాడుగా ఏడేళ్ళ వాసు లేతమనసు ఎంత తల్లడిల్లుతోందో! స్కూల్లో వున్నంతసేపు స్నేహితులమధ్య దిగులు కనిపించదు. ఇంటికి వస్తే కన్నతల్లి మీద బెంగ ఆవరిస్తుంది. సవతితల్లి ప్రతిదానికీ ఈసడిస్తుంది. తండ్రి పట్టించుకోడు.

మంజుల వచ్చిన కొత్తలో వాసు 'అమ్మా' అని ఒకసారి పిలిచాడు "ఎవర్రా నీకు అమ్మ? శనిగొట్టు వెధవా! ఇంక ఎప్పుడైనా అలా పిలిచావా నాలిక చీరేస్తా. నీ దరిద్రపు మొహం చూస్తేనే పాపం" అని మంజుల మండిపడింది.

"పిన్నీ అని పిలవాలిరా సన్నాసి" అన్న తండ్రి ఆజ్ఞలో చీదరింపు.

వాసు చిన్నాచితకా పనులు చేస్తూనే వుంటాడు. అయినా "ఆ కనేదేదో ఆడకుంకని కనిచస్తే నా చేతికింత సాయంగానైనా వుండేదిగా. అడ్డమైన వెధవలకీ చాకిరీ చేయాల్సిన కర్మ పట్టింది నాకు." మంజుల తిట్లకి పల్లవి ఇది. సీతాపతి వెంటనే వంత పలకాలి. లేకపోతే "అలా బెల్లంకొట్టిన రాయిలా నోరు మెదపరే!" అని భగ్గుమనేది. సీతాపతి నోటికీ చేతికీ పని కల్పించుకుని వాసుని బండబూతులు తిడుతూ చేతికి ఏది అందితే దాంతో బాదడం అలవాటు చేసుకున్నాడు. అంతటితో సన్నివేశం పతాకస్థాయి అందుకున్నదని మంజుల గ్రహించేది. ఆమె కళ్ళు తాత్కాలికంగా చల్లబడేవి.

వాసు పచారీ దుకాణానికి వెళ్ళి పిన్ని చెప్పిన సరుకులు తెస్తాడు. స్కూలు టైం అయ్యేవరకు ఇతర పనులు చేసి తీరాలి. తన పనులన్నీ తనే చేసుకోవాలి. స్నానం చేయడం, తల దువ్వుకోవడం, పుస్తకాలు సర్దుకోవడం అన్నీ తనే చేసుకోవాలి. అన్నంతోపాటు ప్రతి పూటా బోలెడు శాపనార్థాలు తినాలి. తన కంచం తనే కడుక్కోవాలి.

ఎవరో చెప్పగా ఈ బాధలు గురించి వాసు మేనమామకి తెలిసింది. వచ్చి తనతో తీసుకువెళ్ళి చదువుసంధ్యలు చెప్పిస్తానని ఎంత బతిమాలినా సీతాపతి దంపతులు దొంగప్రేమ అభినయించి, కపటవాగ్దానాలు చేసి ఆయన్ని అవాక్కు చేశారు.

"మీరు భలేవారే అన్నయ్యగారూ! మేనమామగా అడగడం మీ ధర్మం. కాదనం. కానీ మాకింకెవరున్నారు, పిల్లాపీచా వాసు తప్ప? సవతికొడుకైనా సొంతకొడుకైనా మాకు వాడొక్కడే. వాడికేం లోటు రానివ్వం. మీరు నిశ్చింతగా వెళ్ళిరండి. ఏవండీ మీరేమంటారు?" మంజుల ప్రశ్నకు సీతాపతి తలూపాడు. "భేషుగ్గావుంది" అన్నాడు.

మేనమామకి అంతా అర్థమయింది. ఎవరూ వినకుండా "మామయ్యా! నేను నీతో వచ్చేస్తా" అని వాసు పెట్టుకున్న మొర అరణ్యరోదనమే అయింది.

మేనమామ నిస్సహాయుడు. తిరిగి వెళ్ళిపోయాడు. ఆ రోజు వాసుకు పుట్టెడు తిట్లూ, బడెత దెబ్బలూ తప్పలేదు.

వాసుకు చంద్రం మంచి మిత్రుడు. ఇద్దరూ ఒకే స్కూల్లో ఒకే తరగతి చదువుతున్నారు. చంద్రం ఎవరోకాదు, రఘురాం కొడుకు. తెలివితేటలున్నవాడు. వాసంటే చాలా ఇష్టం. వాసుకు అమ్మలేదని చంద్రానికి తెలుసు. అందుకే అతనిమీద జాలి. ఇద్దరూ ఎన్నెన్నో కబుర్లు చెప్పుకుంటారు. రఘురాంకి చంద్రం ఒక్కడే కొడుకు. గారాబంగా పెరుగుతున్నాడు. అమ్మా, నాన్నా తనకి ఎలాంటి బొమ్మలు కొన్నదీ, ఎక్కడెక్కడికి తీసుకువెళ్ళిందీ, ఏమేమి చిత్రవిచిత్రాలు చూసిందీ అన్నీ చంద్రం పూసగుచ్చినట్టే చెప్పేవాడు. చంద్రం కళ్ళల్లో మెరిసే ఆనందం వాసును ఆకర్షించేది. ఆ మెరుపు గురించే ఆ చిన్నారి మనసు ఆలోచించేది. వాసు తాను కూడా తోటి మిత్రులతో అలాంటి సంగతులు ఎప్పుడైనా చెప్పే అవకాశం కలుగుతుందా అని పదేపదే అనుకునేవాడు. ఆ అవకాశంకోసం ఉవ్విళ్ళూరసాగాడు. కానీ అది అందని ద్రాక్షపండని తెలుసు. కానీ ఆశ అతన్ని వదలలేదు. ఏమైనా సరే చంద్రంతో ఇతర మిత్రులతో తాను అలా చెప్పుకుని ఆనందించాలని వాసు మనసు పట్టుపట్టింది.

ఒకసారి స్కూలు లీజర్‌లో మిత్రులందరూ కబుర్లలో పడ్డారు. వాసు మనసులో కోరిక పొంగులు వారింది. ఎంతకాలంగానో వున్న ఆశ పెల్లుబికింది. "మా చిన్నాన్న ఎంత మంచివాడో చెప్పలేను. సాఫ్ట్ టాయిస్ తెచ్చి ఇచ్చాడు. ఇంకా రకరకాల బొమ్మలు తెస్తానన్నాడు. కథలు భలేగా చెబుతాడు. మా చిన్నాన్న మారుతీకార్లో నన్ను జూకి తీసుకువెళ్ళాడు. షాపింగ్ చేశాం...." నేస్తాలందరూ ఆశ్చర్యంతో వింటుంటే వాసు కళ్ళు కాంతులీనాయి. ఈ ఆనందంలో చంద్రం పాలుపంచుకున్నాడు.

చంద్రం ఇంటికి వెళ్ళి వాసూవాళ్ళ చిన్నాన్న వచ్చినసంగతీ, ఆయన గురించి వాసు చెప్పిన వివరాలూ తల్లిదండ్రులకు చెప్పాడు.

రఘురాం ముందు ఆశ్చర్యపోయినా ఆ సంగతి విని చాలా సంతోషించాడు. మర్నాడు సీతాపతితో ఈ సంగతి ప్రస్తావించాడు.

ఇదంతా సీతాపతి బుర్రలో కదలాడింది. నెత్తిమీద పిడుగు పడినట్లయింది. పాతాళంలోకి దభాలున కుంగిపోయినట్లనిపించింది. "ఎవరీ ముదనష్టపు చిన్నాన్న?"అనే ప్రశ్న భూతంలా నెత్తిమీద కూర్చుంది. తనకెవరూ అన్నదమ్ములులేరే! కజిన్స్ కూడా ఎవ్వరూ ఎంత వెతికినా లేరే! మరి ఈ దౌర్భాగ్యుడెక్కడనుంచి దాపురించాడు? తనకూ మంజులకూ వయస్సులో పదిహేనేళ్ళు తేడా వుంది. ఈ సత్యం మొట్టమొదటిసారి గుండెలో గుచ్చుకుంది. అనుమానం దెయ్యంలా ఆవరించింది. అంతే. సీతాపతి కాలు కాలిన పిల్లిలా మారిపోయాడు. కంపరం పుడుతోంది. పెద్ద గందరగోళంలో చిక్కుకుపోయాడు. ఏమి చేయాలో తోచలేదు. మంజులతో ఈ మాట ఎత్తే ధైర్యంలేదు. లోలోపల సందేహాల దొంతరలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అందుకే అనునయంగా వింత వింత ప్రశ్నలు మంజులపై నాజూకుగా విసరడం ఆరంభించాడు. ఎన్నడూ సరిగా పలకరించని వాసును భార్య

చూడకుండా చేరదీసి వివరాలు గుంజే ప్రయత్నం చేశాడు. చివరకు ఇరుగుపొరుగువారిని పరోక్షంగా అడిగాడు కూడా.

పనిమనిషినుంచి ఏదైనా రహస్యం లాగొచ్చనుకుని ఆ ప్రయత్నం సాగించాడు.

హఠాత్తుగా ఆఫీసునుంచి మధ్యలో ఏదో వంకపైన ఇంటికొచ్చేవాడు. 'క్లూ' దొరకక సీతాపతి నానా యాతనలు పడుతున్నాడు. ఆ 'చిన్నాన్న' తారసపడితే ముక్కలు విరగతన్నాలనుకున్నాడు. ఎన్నిచేసినా కూపీలాగే ప్రయాస వృథా అయింది. సీతాపతికి మార్గాంతరం తోచలేదు. మనసు విపరీతంగా చీకాకు పడుతోంది.

ఒక ఆదివారం సాయంత్రం సీతాపతి వక్కపొడి పొట్లం కొనుక్కురమ్మని వాసును దుకాణానికి పంపుతున్న సంగతి విని, వచ్చేటప్పుడు ఉల్లిపాయలు మంచివి ఏరి కిలో తీసుకురమ్మని మంజుల పురమాయించింది. వాసు దుకాణంనుంచి రావడం అయిదు నిముషాలు ఆలస్యమయింది. అసలే అసహనంతో కుతకుతలాడుతున్న సీతాపతి కోపంతో ఉగ్రుదయ్యాడు. వాసును చడామడా తిట్టి రెండు అంటించి బయటికి వెళ్ళిపోయాడు. ఉల్లిపాయల్లో ఒకటి కుళ్ళిపోవడం గమనించిన మంజుల వెర్రెత్తిన దానిలా వెదురు బద్ద తీసుకుని వాసును గొడ్డును బాదినట్లు బాదింది. ఆమె ఆగ్రహం చూసి వాసు వణికిపోయాడు. అక్కడ వుండలేక బయటికి పరుగెత్తాడు.

దిక్కుతోచక చంద్రం ఇంటికి వెళ్ళాడు. వాసు చేతులూ బుగ్గలూ కందిపోయి వాచి వుండడం గమనించిన చంద్రం తల్లి అతణ్ణి దగ్గరకు తీసుకుని ఏమయిందని అడిగింది.

వాసు జవాబివ్వలేదు. వీపు మంట పుడుతుంటే ఆమె చెయ్యి మెల్లగా తప్పించాడు. ఆమె వాసు వీపుమీద దెబ్బలు చూసి నివ్వెరపోయింది. సంగతి గ్రహించింది. వాసును అక్కున చేర్చుకుని ఓదార్చింది.

వాసు గుండె పొరలనిండా అల్లుకుపోయిన బాధ ఒక్కసారి పైకి ఉబికింది. ''అమ్మా'' అని బావురుమన్నాడు. ఆమె ద్రవించిపోయింది. చంద్రం కళ్ళు చెమర్చాయి.

"మా నాన్న బాగా తిట్టి, కొట్టి వెళ్ళిపోయాడు. మా పిన్ని మళ్ళీ వెదురుబద్దతో కొట్టింది. ఎవరితో చెప్పుకోను? మా చిన్నాన్న నాకు నిద్రలోనే కనిపిస్తాడు. కలలోనే నాకు అన్నీ తెచ్చి ఇస్తాడు. నాకు కలలోనే కథలు చెబుతాడు. కలలోనే నన్ను ఎక్కడికైనా మారుతీకారులో తీసుకువెళ్తాడు. ఉట్టప్పుడు మా చిన్నాన్న కనిపించడు" అని వాసు ఆమె ఒళ్ళో తల పెట్టుకుని వెక్కివెక్కి ఏడ్వసాగాడు.

పక్కగదిలో మిత్రుడు రఘురాంతో మాట్లాడుతున్న సీతాపతికి రఘురాం వాగ్ధాటిలో వాసు ఏడుపు వినిపించలేదు. కానీ తర్వాత అతను చెప్పిన మాటలు వినిపించాయి. నిర్ఘాంతపోయాడు. గతం యావత్తూ కళ్ళముందు కదలాడింది. మొదటి భార్య మాలతికి ఇచ్చిన వాగ్దానం చెవుల్లో మారుమోగింది. ''వాసును

ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటాను" అన్న మాట గుర్తుకొచ్చింది. కనువిప్పు కలిగింది.

సీతాపతి లేచి వెంటనే హాల్లోకి వచ్చాడు. వాసును గుండెలకు హత్తుకున్నాడు. ఎత్తుకుని పెద్ద పెద్ద అంగలతో ఇంటిముఖం పట్టాడు.

రుద్రమూర్తిలా వున్న భర్తను చూసి మంజుల విస్తుపోయింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. ఆశ్చర్యంనుంచి తేరుకోకముందే సీతాపతి "నువ్వు మనిషివా... పశువ్వా?... నా ప్రాణంవంటి బిడ్డను ఇలా కొడతావా?" అని అరుస్తూ ఒళ్ళుపై తెలియకుండా ఆమెను కొట్టసాగాడు.

"నాన్నా! అమ్మని కొట్టొద్దు" అని వాసు అడ్డుపడ్డాడు.

"బాబూ! వాసూ!! నన్ను అడ్డుకుంటున్నావా? నువ్వెంత మంచివాడివిరా! ఇప్పటి నుంచి నేను నిజంగా నీకు అమ్మనే" అని బావురుమంది మంజుల.

సీతాపతి కళ్ళు ఆనందబాష్పాలతో నిండాయి.

('విపుల' - మార్చి, 2002)